పది పరీక్షలు షురూ

- నియోజకవర్గంలో 48 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- మొదటి రోజు 20 మంది విద్యార్థుల గైర్హాజరు



మూసాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థులను చెక్ చేసి లోపలకు పంపిస్తున్న ఉపాధ్యాయులు



కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు



మూసాపేటలోని కేర్‌వుడ్ కాన్సెప్ట్ స్కూల్‌లో విద్యార్థులను చెక్ చేస్తున్న ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి, బాలానగర్ మండల పరిధిలో 10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 9943 మంది విద్యార్థుల కోసం 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులను పరీక్ష హాలులోకి అరగంట ముందే అనుమతించారు. మొదటి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష పూర్తయ్యేంత వరకు విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాల బయట వేచి ఉన్నారు. మొదటి పరీక్షకు 9943 విద్యార్థుల్లో 9923 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 20 మంది గైర్హాజరయ్యారు. – మూసాపేట



భరత్‌నగర్ కాలనీలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు



మూసాపేటలోని ప్రభుత్వ బాలిక పాఠశాలలో గుమిగూడిన విద్యార్థులు, తల్లిదండ్రులు



మోదీ పాలనలో దేశ ప్రజలకు భద్రత పెరిగింది

- మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్
- ఫిట్ సంస్థ ఆధ్వర్యంలో విద్యావంతులు, మేధావులతో సమావేశం



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపే లక్ష్యంగా ఫిట్ సంస్థ ఆధ్వర్యంలో 'ఫారమ్ టు ఇంప్రూవ్ థింగ్స్', 'మరోసారి మోదీ.. ఈసారి 400 ప్లస్'నినాదంతో కూకట్‌పల్లి పీఎస్ఎం పాఠశాల ఆడిటోరియంలో విద్యావంతులు, మేధావులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, గౌరవ అతిథిగా కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థలో ప్రపంచ స్థాయిలో 11వ స్థానంలో ఉన్న మన దేశాన్ని ప్రస్తుతం మోదీ పాలనలో 5వ స్థానానికి చేరిందన్నారు. ఆ స్థానాన్ని 3వ స్థానానికి తీసుకురావటమే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రధాని మోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దేశం రూపురేఖలు మారిపోయాయని అన్నారు.

◆ పుల్వామా దాడి చేసిన టెర్రరిస్టులపై సర్జికల్ స్ట్రైక్ చేసి హెచ్చరించారన్నారు. మోదీ పాలనలో టెర్రరిస్టుల దాడులు లేవని ప్రజలకు భద్రత పెరిగిందన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధ సమయంలో విద్యార్థులను తిరిగి భారత్‌కు సమర్థవంతంగా తీసుకువచ్చిన ఘనత మోదీకే దక్కిందన్నారు. 500 ఏళ్ల కాలంగా ఎదురు చూస్తున్న రామ మందిర నిర్మాణం మోదీ సారథ్యంలో సాకారం చేసుకోవటం ఆనందంగా ఉందన్నారు.

◆ ఈసారి బీజేపీ గెలవనున్న 400 సీట్లలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ సీటు కూడా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఫిట్ సభ్యులు, నాయకులు బీజేపీ కన్వీనర్ శ్రీకర్‌రావు, బీజేపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి ప్రేమకుమార్, ప్రీతమ్‌రెడ్డి, వినోద్, అనీల్, ఉదయ్, సంతోష్, సూరిబాబు, ప్రేమ్, మహిళా నాయకురాళ్లు రేవతి, సునీత, లహరి తదితరులు పాల్గొన్నారు.

సగరుల అభివృద్ధికి కృషి చేస్తా

నగర రజతోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ




జగద్గిరిగుట్ట షిరిడీహిల్స్‌లో వేడుకల్లో పాల్గొన్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట షిరిడీహిల్స్‌లో సగర ఉప్పర మహిళా సంఘం సగర ఉప్పర యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన 25వ రజతోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి రంగారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సగరుల కుల గురువు భగీరథ మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సగర ఉప్పర మహిళా సంఘం, యువజన సంఘం రజతోత్సవాన్ని నిర్వహించుకోవటం సంతోషకరమైన విషయమన్నారు. సగర మహిళల విజ్ఞప్తి మేరకు వారికి ఈ స్థలంలో ఒక షెడ్‌తో పాటు వారు ఆర్థికంగా ఎదగడానికి 50 కుట్టు మెషిన్లను అందజేశామన్నారు. మహిళా సాధికారతకు, సగరుల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, తెలంగాణ సగర ట్రస్ట్ బోర్డు చైర్మన్ మారుతి సాగర్, తెలంగాణ సగర ఉప్పర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్, స్థానిక సగర సంఘం అధ్యక్షుడు కొండయ్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.



రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి



బాలానగర్: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలుపుతూ సోమవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెడ్డి సామాజికవర్గంలో అనేక మంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారు ఉన్నారన్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారి భవిష్యత్తు కోసం విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి 20 లక్షల విదేశీ విద్యా పథకం ప్రవేశపెట్టాలన్నారు. అదే విధంగా ఆర్థిక సహాయంతో కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల నిధులు మంజూరు చేసి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అనేక సంవత్సరాలుగా రాజకీయాలకు అతీతంగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు పనిచేసిన జేఏసీ నాయకులకే కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న కూకట్‌పల్లి నేత బండి రమేష్



అమ్మవారి పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నేత గొట్టిముక్కల వెంగళరావు

కూకట్‌పల్లి: కోమనిగడ్డ సంగీత్‌నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం 25వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూకట్‌పల్లి బీఆర్ఎస్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. పూజల్లో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సత్యం శ్రీరంగం, తూము వేణు, శేరి సతీష్ రెడ్డి, కొమ్ము సత్తయ్య, మేకల రమేష్, గోవింద్ గౌడ్, దండుగుల యాదగిరి, కృష్ణ రాజ్‌పుత్, సురేష్, సత్యనారాయణ, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ డివిజన్ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, పుష్పరెడ్డి, రమాదేవి, జ్యోతి, అనిత, రజిత, దిలీప్, భారతమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటాం

ఉమ్మడి ప్రకటన చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యే సోమవారం ప్రకటించారు. మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబిహా ఇంద్రారెడ్డి నివాసంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ గెలుస్తూ వస్తోందన్నారు. ఈసారి కూడా పార్టీ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు.

◆ పార్టీ రెండు సార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు ఇప్పుడు వేరే పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు. వారిని ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటుందన్నారు. కేసీఆర్‌ని ప్రజలు తిరిగి గుర్తు చేసుకుంటున్నారని వారు పేర్కొన్నారు. త్వరలో పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తామన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, ప్రకాష్‌గౌడ్, కాలే యాదయ్య, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, యెగ్గే మల్లేశం, దయానంద్ గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, యువనేత కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జహంగీర్



సాక్షి,సిటీబ్యూరో: కాంగ్రెస్ మైనారిటీ విభాగం ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడిగా మహమ్మద్ జహంగీర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఏఐసీసీ మైనారిటీ విభాగం వైస్ చైర్మన్, తెలంగాణ ఇన్‌చార్జి ఫర్హాన్ అజ్మీ ఆదేశాలు జారీ చేశారు. డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి మైనారిటీల మద్దతు కూడగట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జహంగీర్ తన నియామకానికి సహకారించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

పుట్టినరోజు శుభాకాంక్షలు



ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ మాజీ కౌన్సిలర్ మక్కాల నర్సింగ్‌రావు పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వాహించారు. ఓల్డ్‌బోయిన్‌పల్లిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానుల మధ్య పుట్టిన రోజు కేక్‌ను కట్ చేశారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, నాయకులు కర్రె జంగయ్య పుష్పగుచ్ఛం అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానం

మోతీనగర్: అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సి. సుంకన్న పేర్కొన్నారు. సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పర్వత్‌నగర్ ప్రధాన రోడ్డులోని పర్వతవర్ధిని శివాలయంలో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సోమవారం పర్వదినాల్లో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని అన్నారు. అదే విధంగా సోమవారం సాయంత్రం భక్తి గీతాలు, భజన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఆనంద్, అంతయ్య, తిరుపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



'పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారు'

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి: బోయిన్‌పల్లి డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు కార్యాయంలో బండి రమేష్ సమక్షంలో వారు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాలకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీ-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, దండుగుల యాదగిరి, మేకల రమేష్, కృష్ణ రాజ్‌పుత్, మల్లికార్జున యాదవ్, మహేష్‌యాదవ్, గోవింద్‌గౌడ్, అనిల్, గుండమళ్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మోతీనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ రాజకీయ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కూకట్‌పల్లి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. సోమవారం అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్‌లో పలు పార్టీలకు చెందిన నాయకులు బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తూచా తప్పకుండా అమలు చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు.మాజీ కార్పొరేటర్ సయ్యద్ బాబు, నాయకులు వేముల సత్యం, సి.సుంకన్న, నరసింహ యాదవ్, కనకయ్య, మహిళా అధ్యక్షురాలు రేష్మ, తూము వేణు, దినేష్ చౌదరి పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన బోయిన్‌పల్లి నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బండి రమేష్

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంకు శుభాకాంక్షలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల తర్వాత నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. అందులో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంను కూకట్‌పల్లి నియోజకవర్గం ఎస్సీసెల్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పతికుమార్, నాయకులు నల్లోల రాజేందర్, చీలకోరు కృష్ణ, ప్రసన్నకుమార్, గజనంద్ శేఖర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి

కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి బాలపీరు





దాడిలో గాయపడిన వీరగల్లా శంకర్‌ను పరామర్శిస్తున్న బాలపీరు

కూకట్‌పల్లి: బాలానగర్ మండలం, ఇంద్రానగర్, ఐడీపీఎల్, మెడ్‌ప్లస్ వద్ద వీరగల్లా శంకర్ అనే వ్యక్తిపై ఈ నెల 5వ తేది రాత్రి 20 కొంత మంది వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయన ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ సందర్భంగా కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి నాగనిగొళ్ల బాలపీరు సోమవారం శంకర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రానగర్ బస్తీలో మధుగౌడ్ అనే వ్యక్తి ప్లాట్లు ఎక్కువగా వేసుకున్నాడని బయటకు తెలపటంతో కొంతమంది శంకర్‌పై దాడి చేశారన్నారు. ఎఫ్ఐఆర్ నమోదైనా నిందితులను ఇప్పటి వరకు అరెస్టు ఎందుకు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్రశేఖర్, శంకర్, రాజులు పాల్గొన్నారు.

విజేత సూపర్ మార్కెట్‌కు బిజినెస్ ఎక్సలెన్సీ అవార్డు



సందీప్ చౌదరికి బిజినెస్ ఎక్సలెన్సీ అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రులు కోమటివెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు

కూకట్‌పల్లి: విజేత సూపర్ మార్కెట్స్ కంపెనీ ఈడీ మురకొండ సందీప్ చౌదరికి బిజినెస్ ఎక్సలెన్సీ అవార్డు వచ్చింది. సోమవారం జరిగిన హెచ్ఎంటీవీ-2023 బిజినెస్ ఎక్సలెన్సీ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రులు కోమటివెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు ఆయనను అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా సందీప్ చౌదరి మాట్లాడుతూ.. తన తండ్రి జగన్‌మోహన్‌రావు అడుగుజాడల్లో నడుచుకుంటున్నామని అన్నారు. 1999 చందానగర్‌లో తొలిసారిగా విజేత సూపర్ మార్కెట్‌ను నెలకొల్పామన్నారు. నేటికి 25 సంవత్సరాల విజయోత్సవంలో 109 శాఖలు ఏర్పాటు చేశామన్నారు. కస్టమర్లే దేవుళ్లు అనే సూక్తిని నిత్యం జపిస్తూ 1999లో సూపర్ మార్కెట్ వ్యాపారంలోకి ఒక అడుగు వేశామన్నారు. తమ కష్టాన్ని నిజం చేస్తూ నేడు 109 బ్రాంచీలతో విజేత సూపర్ మార్కెట్ ఒక బ్రాండుగా నిలిచి రజతోత్సవాలు జరుపుకుంటుందన్నారు. మమ్మల్ని నమ్మిన కస్టమర్ దేవుళ్లకు, ఖాతాదారులకు, డిస్ట్రిబ్యూటర్స్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కుటంబ సభ్యులు, ఉద్యోగ సహచరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. వారి కృషి పనిపట్ల నిబద్ధతే విజేత విజయానికి మూల కారణమన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్ డీబీ రామాచారికి అరుదైన అవకాశం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డీబీ రామాచారి కి అరుదైన గౌరవం దక్కింది. టెట్రాహెడ్రాన్ అండ్ టెట్రాహెడ్రాన్ లెటర్స్ ఎడిటోరియల్ బోర్డులో చేరేందుకు అవకాశం కల్పించారు. ఆయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీలోని క్యాటలిసిస్ లేబోరేటరీలో ప్రొఫెసర్‌గా విధులను నిర్వహిస్తున్నారు. ప్రతిష్టాత్మక ఆర్గానిక్ కెమిస్ట్రీ జర్నల్స్ అనేవి ఆర్గానిక్ కెమిస్ట్రీ రంగంలో విభాగాలు, ప్రపంచవ్యాప్తంగా పూర్తి అసలైన పరిశోధనా పత్రాలను వేగంగా ప్రచురించడానికి అంతర్జాతీయ జర్నల్‌లుగా 1959 నుంచి గుర్తింపు పొందాయి. కాగా ప్రొఫెసర్ రామాచారి 115 కంటే ఎక్కువ ప్రచురణలను కలిగి ఉండడం విశేషం. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బెంగళూరులోని ఫెలో వంటి ఇతర అవార్డులు, గుర్తింపు కూడా పొందారు.ఆయన అనేక అవార్డులతో పాటు 2014లో హెచ్‌సీయూ చాన్సలర్స్ అవార్డును కూడా సాధించారు. 22 మంది పీహెచ్‌డీలకు మార్గనిర్దేశం చేయడం విశేషం. ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

మహిళాశక్తి అవార్డుల ప్రదానం

రాయదుర్గం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సాధికారత కోసం పనిచేస్తున్న ప్రఖ్యాత సంస్థ ఉమెనార్జీ తెలంగాణ మహిళా అవార్డుల వేడుకను గచ్చిబౌలిలోని నిథమ్ ప్రాంగణంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఇందులో భాగంగా విమెనర్జీ, వీపియుమ్, ఇతర ప్రధాన 30 సంస్థలతో కలిసి యునైటెడ్ తెలంగాణ లోకల్ ఉమెన్స్ అసోసియేషన్ ఫ్రంట్(యూటీఎల్‌డబ్ల్యూఏఎఫ్)ను ఏర్పాటు చేశారు. అనంతరం నూతన సంస్థ లోగోను కూడా ఆవిష్కరించారు. అపోలో ఆస్పత్రి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి, కాంటినెంటల్ ఆస్పత్రి వైస్‌చైర్మన్, డయాబెటిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ అనురాధారెడ్డి, అగ్రి ఇండస్ట్రియలిస్ట్ సుధారెడ్డితో కలిసి 300 మంది వివిధ రంగాలకు చెందిన మహిళలకు మహిళా శక్తి అవార్డులను ప్రదానం చేశారు.యూటీఎల్‌డబ్ల్యూఎఎఫ్ వ్యవస్థాపకురాలు దీప్తిరెడ్డి మాడుగుల మాట్లాడుతూ స్థానికేతర పెట్టుబడిదారులు స్థానిక వనరులను అన్యాయంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ మహిళలు వారి సొంత ఎంఎస్ఎంఈ అవకాశాలను ఎలా కోల్పోతున్నారో వివరించారు. స్థానిక జీవనోపాధికి ఉద్దేశించిన గ్రాంట్లు, నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.